క్లుప్తంగా

గిరిజనులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు

మందస: గిరిజనులకు జరుగుతున్న అన్యాయాలపై ప్రభుత్వం, అధికారులు స్పందించి న్యాయం చేయాలని గిరిజన సంఘం నాయకులు కోరారు. మందసలో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ బోయ, వాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చే ప్రతిపాదనను హైకోర్టు తిరస్కరించిందన్నారు. ఈ నేపథ్యంలో రెండోసారి ఏక సభ్య కమిషన్‌ను ప్రభుత్వం నియమించడం తగదన్నారు. 1/70 చట్టాన్ని అమలు చేయాలన్నారు. రాజ్యాంగం కల్పించిన ఐదో షెడ్యూల్ హక్కుల రద్దుకు కేంద్ర ప్రభుత్వ స్థాయిలో కుట్ర జరుగుతోందని ఆరోపించారు. గిరిజనులకు జరుగుతున్న అన్యాయాలపై ఈ నెల 24వ తేదీన మందసలో నిరసన ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి సవర ధర్మారావు, సవర గురునాథ్, భాస్కరరావు, ఫల్గుణరావు, ఢిల్లీ పాల్గొన్నారు.

'కొత్తమ్మతల్లి' కమిటీ ప్రత్యేక ఆహ్వానితుడిగా గోవిందరావు



కోటబొమ్మాళి: కొత్తమ్మ తల్లి ఆలయ కమిటీ ప్రత్యేక ఆహ్వానితుడిగా దంత గ్రామానికి చెందిన బాడాన గోవిందరావును ప్రభుత్వం నియమించింది. ఈ విషయాన్ని ఆలయ ఈవో వి.వి.సూర్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు దేవదాయశాఖ అధికారుల నుంచి శనివారం ఉత్తర్వులందినట్టు పేర్కొన్నారు.

నేడు అమలపాడులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

వజ్రపుకొత్తూరు: అమలపాడులో సోమవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు స్థానిక సర్పంచ్ దున్న రత్నంబాలరాజు తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగే కార్యక్రమంలో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పాల్గొంటారన్నారు. అధికారులు, పార్టీ నాయకులు హాజరు కావాలని కోరారు.

వైఎస్సార్ టీఎఫ్ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరణలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ తదితరులు

టెక్కలి: వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ డైరీలు, క్యాలెండర్లు, స్టిక్కర్లను ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యా వ్యవస్థ పటిష్టానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి పట్ల విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ టీఎఫ్ నాయకులు మజ్జి చిన్నబాబు, తమ్మినేని చందనరావు, కోదండరామిరెడ్డి, లక్ష్మీనారాయణ, గిరి, యర్రన్న, తిరుపతిరావు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కబడ్డీ టోర్నీ విజేత జిల్లుండ



విజేతలకు షీల్డు అందజేస్తున్న ఎస్సై రామకృష్ణ

ఇచ్ఛాపురం రూరల్: కొఠారీ గ్రామంలో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ టోర్నీలో జిల్లుండ జట్టు విజయాన్ని సాధించింది. కొఠారీ కమలాక్షి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలు శనివారం అర్ధరాత్రి వరకు ఫ్లడ్‌లైట్ల వెలుగులో హోరాహోరీగా సాగాయి. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో జిల్లుండ, లండారిపుట్టుగ, డొంకూరు జట్లు గెలుచుకున్నాయి. విజేతలకు రూరల్ పోలీసుస్టేషన్ ఎస్సై కె.రామకృష్ణ షీల్డుతో పాటు వరుసగా రూ.10 వేలు, రూ. 7వేలు, రూ. 3 వేలు నగదు బహుమతులుగా అందజేశారు. కార్యక్రమంలో కొచ్చెర్ల యాదవరెడ్డి, దువ్వు పోతయ్య, సాడి సహదేవ్ రెడ్డి, యువకులు పాల్గొన్నారు.

సీఎం ఆశయ సాధనకు కృషి



దుక్క లోకేశ్వరరావు

ఇచ్ఛాపురం:ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తానని రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావు అన్నారు. చైర్మన్‌గా పదవీ కాలాన్ని మరో రెండేళ్లు పెంచుతూ ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. మరోసారి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో పాటు రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి పిరియా సాయిరాజ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రజల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు
- సరియాపల్లిలో రెండో రోజూ 'గడప గడపకు మన ప్రభుత్వం'



సరియాపల్లి పంచాయతీ జగన్నాథపురంలో మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

మందస: రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఆర్థికాభ్యున్నతికి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. ఉద్దాన ప్రాంతమైన సరియాపల్లి పంచాయతీ పరిధిలో రెండో రోజైన ఆదివారం కూడా సర్పంచ్ బత్తిని వెంకట్ ఆధ్వర్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరు అడిగి తెలుసుకున్నారు. ఎంతమేర లబ్ధి చేకూర్చిందో వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి కుటుంబాన్ని నవరత్నాలతో ప్రభుత్వం ఆదుకుంటోందన్నారు. దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను ప్రథమ స్థానంలో నిలపడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. విద్య, వైద్య రంగాలను ప్రక్షాళన చేసి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. ఉద్దానం సమస్యలను పూర్తిగా పరిష్కరించడానికి చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. వచ్చే ఏడాదిలోగా ఉద్దానాన్ని పట్టి పీడిస్తున్న కిడ్నీవ్యాధి సమస్యకు పరిష్కారం దిశగా ప్రభుత్వం చేపట్టిన పనులు పూర్తికానున్నట్టు వెల్లడించారు. ఉద్దానం పంటలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని గిట్టుబాటు ధర, తెగుళ్ల సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న ప్రభుత్వానికి అండదండలు అందించాలని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. గత పాలకులు నిర్లక్ష్యం చేసిన జంతిబంధను మినీ రిజర్వాయర్‌గా నిర్మించడానికి కృషి చేస్తున్నట్టు మంత్రి వెల్లడించారు. స్థానికులతో కలసి సుమారు మూడు కిలోమీటర్లు కాలినడకన మంత్రి అప్పలరాజు జంతిబంధకు వెళ్లి పరిశీలించారు. అధికారులతో మాట్లాడి.. పూర్తిస్థాయి వివరాలను తెలుసుకున్నారు. సరియాపల్లిలో గతంలో ఇచ్చిన హామీ మేరకు మంజూరు చేసిన నీటి పథకాన్ని కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అప్పలరాజుకు ప్రజలు ఘనస్వాగతం పలికారు.

పరామర్శ

ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన హరిపురానికి చెందిన పసుపురెడ్డి ఆనందరావును మంత్రి పరామర్శించారు. ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రిటైర్ విద్యుత్ ఉద్యోగి జన్ని దాలయ్య విశాఖలో చికిత్స పొందుతూ మరణించారు. దాలయ్య కుటుంబంతో పాటు ఇదే గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకుడు బోధ జగ్గారావు, ముంజుల గణేశ్ మరణించగా.. ఆయా కుటుంబాలను కూడా పరామర్శించి సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, జడ్పీటీసీ సభ్యురాలు సవర చంద్రమ్మ, వైస్ ఎంపీపీలు సీర ప్రసాద్, కొర్నాని ఆదినారాయణ, ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు, ఏఈ గార రామ్మోహనరావు, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ అందాల శేషగిరిరావు, బాలిగాం పీఏసీఎస్ చైర్మన్ సాధ్ర ఢిల్లేశ్వరరావు, వైహెచ్‌యూ బోర్డు మెంబరు బత్తిని లక్ష్మణ్, క్లస్టర్ ఇన్‌చార్జి దున్న హరికృష్ణ సర్పంచ్‌లు బత్తిని తేజేశ్వరరావు, మామిడి సింహాద్రి, జగన్నాథపురం పురుషోత్తం, దల్లి జానకీరావు రెడ్డి, రాపాక శేషగిరి, చింతాడ గణపతి, ఎంపీటీసీ సభ్యులు బిసాయి నీలవేణి, గొరకల పార్వతి, పార్టీ మహిళా అధ్యక్షురాలు బళ్ల లీలాకుమారి, నాయకులు జి.కేశవరావు, దున్న బుజ్జి, గస్యా భీమారావు, చిన్నడొంబురు, లచ్చయ్య, భాస్కరరావు, తెప్పల గణపతి, బత్తిని వీరాస్వామి, పసుపురెడ్డి ప్రదీప్ పాల్గొన్నారు.

పేదలందరికీ ఆర్థిక భరోసా

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ
- కర్తలిపాలెంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళకు సంక్షేమాన్ని వివరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

సోంపేట: రాష్ట్రంలో ప్రతిపేదవాడికి ఆర్థిక భరోసా ఇచ్చి వారిని అన్నివిధాల ఆదుకోవడమే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. అందుకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారన్నారు. కర్తలిపాలెం సచివాలయం పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్లలో ప్రభుత్వం ద్వారా చేకూరిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి గడపలో సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి పని చేస్తున్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వ హయాంలో కూడా ఇలాంటి కార్యక్రమం నిర్వహించలేదన్నారు. జగనన్న ప్రతి కుటుంబానికి న్యాయం చేశారనే ధైర్యంతోనే గడప గడపకు వస్తున్నామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. అభివృద్ధి, సంక్షేమంతో రాష్ట్రం ప్రగతిపథంలో పయనిస్తోందన్నారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందకపోతే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పేదల గుండెచప్పుడు తెలుసుకున్న ముఖ్యమంత్రికి మనమంతా అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సోంపేట, కంచిలి ఎంపీపీలు డాక్టర్ నిమ్మన దాస్, పైల దేవదాస్ రెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ మంగి గణపతి, మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ మద్దు రాజారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు రౌతు విశ్వనాథం, సర్పంచ్‌లు పొందూరు గున్నయ్య, శిలగాన భాస్కరావు, సనపల కిరణ్ పాల్గొన్నారు.

పశువుల బారి నుంచి కాపాడాలని వినతి



ఎంపీపీ నిమ్మన దాస్‌కు సమస్యను వివరిస్తున్న జింకిభద్ర రైతులు

సోంపేట: జింకిభద్ర, బెంకిలి గ్రామాల్లో సాగు చేస్తున్న కూరగాయల పంటలను సోంపేట గ్రామస్తులకు చెందిన పశువులు నాశనం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వీటి బారి నుంచి పంటలను కాపాలని కోరుతూ ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్‌కు విజ్ఞప్తి చేశారు. పాడిపశువులు ధ్వంసం చేసిన పంటలను ఎంపీపీకి రైతులు ఆదివారం చూపించి తమగోడును చెప్పుకున్నారు. పోలీసులు, మండల స్థాయి అధికారులకు ఏటా ఫిర్యాదు చేస్తున్నా ఫలితం కనిపించడం లేదన్నారు. పశువులు పంటలను నాశనం చేస్తుండడంతో తీవ్రంగా నష్ట పోతున్నామన్నారు. దీనికి ఎంపీపీ స్పందిస్తూ.. సోంపేట రైతులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రైతులు తామాడ చంద్రశేఖర్, పాతిన బైరాగి, తెలుకుల బాబూరావు ఉన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ

బారువ గ్రామంలో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రామచంద్రపాణిగ్రాహి, జింకిభద్రకు చెందిన రంగోయి భీమారావు కుటుంబాలను ఎంపీపీ పరామర్శించారు. సర్పంచ్‌లు యర్ర రజని, తామాడ పద్మావతి ఉన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



నృత్యంతో ఆకట్టుకుంటున్న బాలికలు



రావణబ్రహ్మ వేషధారణలో పురాణ పద్యాలు పాడుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు







మున్సిపాలిటీలోని ఓ ఫంక్షన్ హాల్‌లో రెండు రోజులు జరిగిన ఉత్తరాంధ్ర రచయితల మహాసభలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులు, రచయితలతో పాటుగా కొంతమంది కళాకారులు ఎంతో ప్రాచుర్యం పొందిన నృత్య కళలను తమదైన శైలిలో ప్రదర్శించి ప్రేక్షకుల మనసులను దోచుకున్నారు.

కాశీబుగ్గ

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మందస: గ్రామీణ నీటి సరఫరా విభాగంలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని మాజీ ఎంఎల్‌ఏ గౌతు శ్యామసుందరశివాజీ అన్నారు. మఖరజోల వద్ద నిరవధిక దీక్షా శిబిరాన్ని ఆయన ఆదివారం సందర్శించి ఉద్యోగులతో మాట్లాడారు. టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, బావన దుర్యోధన పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



మద్దు రాజారావు

సోంపేట: రాష్ట్రంలో వెనుకడిన కులాల అభ్యున్నతి కోసం ఏర్పాటు చేసిన కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్ల పదవీ కాలన్ని మరో రెండు సంవత్సరాలు పెంచినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ మద్దు రాజారావు కృతజ్ఞతలు తెలియజేశారు. తమ సామాజికవర్గం అభ్యున్నతి తనవంతు కృషిచేస్తానని పేర్కొన్నారు.

భగవద్గీతలో ప్రతి సమస్యకు పరిష్కారం

సారవకోట: శ్రీకృష్ణుడు బోధించిన భగవద్గీతలో ప్రస్తుతం మనం ఎదుర్కొంటున్న ప్రతి సమస్యకు పరిష్కారం దొరుకుతుందని ఒడిశాలోని అడవ ఆశ్రమానికి చెందిన వినయ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని బుడితి గ్రామంలో ఆధ్యాత్మిక విజ్ఞాన పీఠం, దివ్యజ్ఞాన సమాజం ఆధ్వర్యంలో సత్సంగం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ని భగవద్గీత పారాయణంతో మానవుల దైనందిన జీవితంలో ఎదుర్కొంటున్న ప్రతీ సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. అల్లు రామయ్య, కరుణాకర్, నరసింహస్వామి ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. విశాఖపట్నానికి చెందిన లండ వెంకటరమణ అన్నసంతర్పణ కార్యక్రమం చేపట్టారు. జాడ మోహనరావు, పిట్ల సోమేశ్వరరావు, మెండ సన్యాసిరావు, రామదాసు పాల్గొన్నారు.

మత్స్యకారులకు బియ్యం, దుప్పట్లు పంపిణీ



బియ్యం, దుప్పట్లు అందజేస్తున్న రామారావు

కవిటి: మండలంలోని మత్స్యకార గ్రామాలకు చెందిన పేదలు, వృద్ధులకు ఎస్.ఆర్ (నర్తు రామారావు) ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఏపీ బ్యూటిఫికేషన్ అండ్ గ్రీనింగ్ కార్పొరేషన్ చైర్మన్ నర్తు రామారావు నివాసం వద్ద ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో వస్త్రాలు, బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. తమ ట్రస్టు ద్వారా పేదలకు చేస్తున్న సేవా కార్యక్రమాలను భగవంతుని సేవగా భావిస్తున్నానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.ఎం.తిలక్, నాయకులు బెందాళం రవణమూర్తి, ఉప్పాడ శేషయ్య, ఎస్‌ఆర్ ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అధికారుల దృష్టికి రైతు సమస్యలు



మాట్లాడుతున్న జయప్రకాష్

ఇచ్ఛాపురం: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషిచేస్తానని రైతు సంఘం కన్వీనర్ జన్నెల జయప్రకాష్ అన్నారు. పట్టణంలోని జామి ఎల్లమ్మ గుడి ఆవరణలో మున్సిపాలిటి, మండలం పరిధిలోని రైతులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అయితే ధాన్యం కొనుగోలు విషయంలో మాత్రం మిల్లర్లు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తుండడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమావేశంలో సంఘ నాయకులు కృష్ణారావు, బి.కామేశ్వరరావు, పి.దేవేంద్ర, దేవరాజు సాహు, ఆర్.గణపతి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమం సందర్శన



వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

కంచిలి: మండపల్లి గ్రామంలోని సీతయ్య ఫౌండేషన్ వారు నిర్వహిస్తున్న వానప్రస్థాశ్రమాన్ని విజయనగరం జిల్లాకు చెందిన రోటరీ గవర్నర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు ఆదివారం సందర్శించారు. ఫౌండేషన్ వారు నిర్వహించతలపెట్టిన 'ఉద్దానం మెడకల్ ఫౌండేషన్'స్వచ్ఛంద సంస్థకు చేయూతనందిస్తామని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. కవిటి మండలం కవిటి కొత్తూరుకు చెందిన డాక్టర్ పూడి రామారావు కూడా ఈ సేవల్లో భాగస్వామ్యం అవుతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రోటరీ గవర్నర్ వెంకటేశ్వరరావును సీతయ్య ఫౌండేషన్ నిర్వాహకుడు గుళ్ల రమేష్ తదితరులు ఘనంగా సన్మానించారు. సోంపేట, ఇచ్ఛాపురం రోటరీ క్లబ్ సభ్యులు ఉన్నారు.

కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతం

- టెక్కలిలో 4,360 మంది హాజరు



కాశీబుగ్గలోని గురుకుల పాఠశాల కేంద్రం వద్ద క్యూలైన్లో అభ్యర్థులు



టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రానికి చేరుకున్న మహిళా అభ్యర్థులు

టెక్కలి: కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం ఆదివారం నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. టెక్కలిలోని 14 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 4,648 మంది అభ్యర్థులకు 4,360 మంది హాజరయ్యారు. ఉదయం 8 గంటలకే కేంద్రాలకు అభ్యర్థులు చేరుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా టెక్కలి సీఐ ఎస్.సూర్యచంద్రమౌళి, ఎస్సై ఎల్.రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. ఏఎస్పీ విఠలేశ్వరరావు, డీటీసీ డీఎస్పీ శ్రీనివాసరావు కేంద్రాలను పరిశీలించారు. పరీక్షల అనంతరం గట్టి బందోబస్తు నడుమ జవాబు పత్రాలను టెక్కలి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కోటబొమ్మాళిలో 47 మంది గైర్హాజర్

కోటబొమ్మాళి: కోటబొమ్మాళిలో నాలుగు కేంద్రాలను పరీక్ష కోసం కేటాయించారు. ఈ కేంద్రాల్లో 1008 మంది పరీక్ష రాయాల్సి ఉండగా.. 47 మంది గైర్హాజరయ్యారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, విక్టరీ, వంశధార కళాశాలలో రెండు కేంద్రాల్లో పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై షేక్‌ఖాదర్ బాషా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అభ్యర్థుల హాల్‌టికెట్లను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతే కేంద్రాల్లోనికి అనుమతించారు. కొత్తపేట బస్‌స్టాండ్ వద్ద హెల్ప్ డెస్కును ఏర్పాటు చేసి సిబ్బందిని ఉంచారు. దీంతో దూర ప్రాంతం నుంచి వచ్చిన అభ్యర్థులు వారికి కేటాయించిన కేంద్రాల విరాలను తెలియపరచడంతో అభ్యర్థులు సులువుగా పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్ష అనంతరం బందోబస్తు నడుమ బస్సులో పోలీసు స్టేషన్‌కు తరలించారు.

కాశీబుగ్గ పోలీసు డివిజన్‌లో 643 మంది గైర్హాజరు

కాశీబుగ్గ: కాశీబుగ్గ పోలీసు డివిజన్ పరిధిలో ఉన్నటువంటి పలాస–కాశీబుగ్గ, టెక్కలిలో కానిస్టేబుల్ ఉద్యోగాల పరీక్ష పకడ్బందీగా జరిగింది. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఏఎస్పీ విఠలేశ్వరరావు నేతృత్వంలో కాశీబుగ్గ డీఎస్పీ ఎం.శివరామిరెడ్డి పకడ్బందీ చర్యలు చేపట్టారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని ఏడు కేంద్రాల్లో 1960 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 166 మంది గైర్హాజరయ్యారు. కాశీబుగ్గ సూర్యతేజ కళాశాల వద్దకు ఆలస్యంగా వచ్చిన ముగ్గురు అభ్యర్థులను పరీక్షకు అనుమతించకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. పరీక్ష కేంద్రాల వద్ద సీఐ గుగ్గిలాపు శ్రీనివాసరావు నేతృత్వంలో భద్రత చర్యలు చేపట్టారు. టెక్కలి రీజనల్ పరిధిలో పరిశీలిస్తే 10,375 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 643 మంది గైర్హాజరైనట్టు అధికారులు వెల్లడించరు. 9,732 మంది పరీక్ష రాశారు.



టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఓ అభ్యర్థి బూటు తనిఖీ చేస్తున్న పోలీస్ సిబ్బంది



కోటబొమ్మాళి: జవాబు పత్రాలను బస్సులో తరలిస్తున్న అధికారులు, ఎస్సై షేక్‌ఖాదర్‌బాషా



కోటబొమ్మాళి: వంశధార కళాశాల కేంద్రం వద్దకు పది నిమిషాలు ఆలస్యంగా వచ్చిన అభ్యర్థిని పరీక్షకు అనుమతించని ఎస్సై షేక్‌ఖాదర్‌బాషా



టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ విఠలేశ్వరావు, ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీనివాసరావు తదితరులు



టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద డిటెక్టర్‌తో అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీస్ సిబ్బంది



కోటబొమ్మాళి: ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రం వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు



టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రం వద్ద హాల్ టికెట్ నంబర్‌తో గదుల వివరాలు చూసుకుంటున్న అభ్యర్థులు